క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

బీమా సాయం అందజేత

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో మంగళవారం అనారోగ్యంతో గట్టన్నగారి వెంకటేశ్వర్లు(43) మృతి చెందాడు. కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద వలంటీర్ పద్మావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్ రూ.10 వేలు గ్రామ సర్పంచ్ పెద్ద ఆంజనేయులు చేతుల మీదుగా అందజేశారు.

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామానికి చెందిన మగ్బుల్ అనారోగ్య కారణాలతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల నగదును మంగళవారం మగ్బుల్ కుమారుడికి గ్రామవలంటీర్ శ్రావణి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసకుమార్ అందించారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మోతుకూరు రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో పవన్‌కుమార్

వెలుగోడు: మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ పవన్ కుమార్ సూచించారు. మంగళవారం గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామాలలో సాగుచేసిన మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం 20 నుంచి 45 రోజుల పంటలో కాండం తొలిచె పురుగు ఉన్నట్లు గమనించారు. పురుగు వలన కలిగే నష్టాన్ని రైతులు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మోత్కూరు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి యూరియా స్టాక్ ను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నాగలింగం, అంజిత్, అప్సర్ పాల్గొన్నారు.

హనుమంత్‌కు పరామర్శ

వెలుగోడు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పని చేస్తున్న హనుమంత్ పక్షవాతంతో బాధపడుతుండగా ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం హనుమంత్ ఇంటికి వెళ్లిన ఆయన అతని ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను ఆరా తీశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అండగా ఉంటారని భరోసా కల్పించారు. అనంతరం రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందించారు. అలాగే ఎంపీపీ లాలం రమేష్ కూడా మరో రూ.5 వేలు అందించి ధైర్యం చెప్పారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి



జూటూరులో నిల్వ చేసిన ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉంచాలని ఏడీఏ ఆంజనేయ అన్నారు. మంగళవారం మండలంలోని జూటూరు, రుద్రవరం, తుమ్మలూరు గ్రామాల్లో ఆర్బీకేలను తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలు రైతులకు ఏ మేరకు అందుతున్నాయని ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశమై మాట్లాడారు. కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో వరి నారుమడులు వేయవద్దని సూచించారు. ఆయన వెంట ఏఈఓ మద్దిలేటి, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

కుక్కలను నియంత్రించండి

కొత్తపల్లి: గోకవరం పంచాయతీ ఎం లింగాపురం గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సమతా సైనిక్‌దళ్ మండల అధ్యక్షుడు సగినెల సురేష్, గ్రామస్తులు శివనాగిరెడ్డి, చంద్రారెడ్డి, చిమ్మె సతీష్, రవి కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో కుక్కలు అధికమయ్యాయన్నారు. వీటితో గ్రామస్తులకు ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. సంగమేశ్వరం వెళ్లే ప్రయాణికులు, స్కూలు పిల్లలు, గ్రామస్తులపై దాడి చేస్తున్నాయన్నారు.

శివలింగాకృతిలో 108 సాలిగ్రామాలు పేర్చి పూజలు

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని వాసవిసత్రంలో ఈ నెల 3న అర్ధచాతుర్మాస్య వ్రతదీక్షను స్వీకరించిన తెనాలి విద్యాపీఠం బాలస్వామిజీ (ప్రజ్ఞానందసరస్వతీ) మంగళవారం 108సాలిగ్రామాలను లింగాకారంలో పేర్చి విశేషపూజలను నిర్వహించారు. శతాబ్దిలో ఓ మారు వచ్చే అధిక శ్రావణమాసం సందర్భంగా శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి వారి దివ్యక్షేత్రంలో తాను దీక్షను తీసుకున్నట్లు స్వామీజీ తెలిపారు.

ఇండోర్ స్టేడియం స్థలం ఏమైనట్లు..?

- 2013లో స్థలం కేటాయించిన అధికారులు
- అది ఎక్కడుందో చూపించని వైనం
- స్థలం చూపితే స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తామంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



స్టేడియం నిర్మాణం కోసం కేటాయించినట్లు పేర్కొంటున్న 717 సర్వేనెంబర్ స్థలం

జూపాడుబంగ్లా: రాజీవ్‌గాంధీ ఖేల్ అభియాన్ కింద ప్రతి మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని 2013లో అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఆయన ఆదేశాల మేరకు మండల కేంద్రంలో స్థలాన్ని కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు నివేదికలు పంపారు. దీంతో త్వరలో స్టేడియం నిర్మిస్తే చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు సులభమవుతుందని గ్రామీణ విద్యార్థులు సంతోషించారు. అయితే వారి ఆశలు నెరవేరకపోగా స్టేడియం నిర్మాణం కోసం కేటాయించిన స్థలం ఎక్కడుందో చూపలేదు.

717 సర్వేనెంబర్‌లో 5.70ఎకరాల స్థలం కేటాయింపు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రాజీవ్‌ఖేల్ అభియాన్ కింద ప్రతి మండల కేంద్రంలో రూ.1.60కోట్ల వ్యయంతో స్టేడియం నిర్మించ తలపెట్టారు. ఇందులో భాగంగానే మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో స్టేడియం నిర్మాణం కోసం స్థలం చూపించాలని 2013 ఆగస్టు 25న అప్పటి కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఆయన ఆదేశాల మేరకు 717 సర్వేనెంబర్‌లో 5.70ఎకరాల స్థలం ఖాళీగా ఉందని పేర్కొంటూ అప్పటి ఆర్ఐ రామాంజనేయులు 2014 సెప్టెంబర్ 26న కలెక్టర్‌కు నివేదికలు పంపించారు. స్థలం చూపించాలని క్రీడాకారులు రెవెన్యూ అధికారులను పలుమార్లు కోరినా ఇప్పటిదాకా చూపించిన దాఖలాల్లేవు. ఇప్పుడైనా స్థలాన్ని చూపిస్తే శాప్ చైర్మన్ సిద్దార్థరెడ్డి సహకారంతో స్టేడియాన్ని కట్టించుకుంటామని వివిధ గ్రామాల క్రీడాకారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుతున్నారు. అయినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.

స్థలం చూపిస్తే స్టేడియం మంజూరు చేయించుకుంటాం



జూపాడుబంగ్లాలో స్టేడియం నిర్మాణం కోసం 2013లో 717 సర్వేనెంబర్‌లో 5.70ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు కలెక్టర్‌కు రెవెన్యూ అధికారులు పంపిన నివేదికలున్నాయి. ఆ నివేదికల ప్రకారంగా స్టేడియం కోసం కేటాయించిన స్థలం ఎక్కడుందో చూపించాలని రెవెన్యూ అధికారులను క్రీడాకారులం కలిసి పలు మార్లు కోరినా వారు ఇప్పటిదాకా స్థలం చూపించటం లేదు. మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో క్రీడాకారులు ఆటలు ఆడుకొనేందుకు స్థలంలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు స్థలం చూపిస్తే శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో స్టేడియం మంజూరు చేయించుకుంటాం. తద్వారా గ్రామీణ క్రీడాకారులు ఆటల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది.

– గోపాల్, ఫ్రెండ్స్ హెల్ప్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు

రికార్డులు పరిశీలిస్తాం



పదేళ్ల క్రితం స్టేడియం నిర్మాణం కోసం జూపాడుబంగ్లాలో స్థలం కేటాయించినట్లు తెలిసింది. దానికి సంబంధించిన రికార్డులు పరిశీలించి స్థలం కేటాయింపుపై సమగ్ర విచారణ చేసి, స్థలం ఎవ్వరికీ కేటాయించనట్లయితే దాన్ని స్టేడియానికి అప్పగించి క్రీడాకారులకు ఉపయోగపడేలా చేస్తాం.

– పుల్లయ్యయాదవ్, తహసీల్దార్, జూపాడుబంగ్లా

సుంకులా పరమేశ్వరికి వెండి తొడుగు బహూకరణ



వెండి తొడుగులో సుంకులా పరమేశ్వరి దేవి

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట కేసీ కాలువ వద్ద వెలసిన సుంకులా పరమేశ్వరి దేవి అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తులు చిలుక శేషయ్య, చిలుక కృష్ణవేణి రూ. 5 లక్షల విలువ చేసే వెండి తొడుగును బహూకరించారు. మంగళవారం అమ్మవారి వెండి తొడుగును గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. కోడుమూరు ఆనంద ఆశ్రమం సద్గురు దాసు ఆధ్వర్యంలో చెన్నయ్య భజన మండలి సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను ఉత్తేజపరిచారు.

23న వాల్మీకుల జనరల్ బాడీ సమావేశం

పగిడ్యాల: ఈనెల 23వ తేదీ ఆదివారం శ్రీశైల క్షేత్ర వాల్మీకుల అన్నదాన సత్రంలో వాల్మీకి సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి గట్టమ్మగారి రామకృష్ణ తెలిపారు. మంగళవారం పాత ముచ్చుమర్రి గ్రామంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రంలో వాల్మీకులు నిర్మించిన అన్నదాన సత్రాలు 60 ఉన్నాయని, రూము దాతలు, సంఘం సభ్యులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రైతుల పొలాలను ఆన్‌లైన్ చేయించండి

- నంద్యాల జిల్లా కలెక్టర్‌ను కలిసిన శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, కొత్తపల్లి జెడ్పీటీసీ సుధాకర్



జిల్లా కలెక్టర్‌కు కొలనుభారతి దేవి చిత్రపటాన్ని బహూకరిస్తున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి

కొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో పేద రైతుల పొలాలను ఆన్‌లైన్ చేయించాలని శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను కోరారు. మంగళవారం కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డితో కలసి జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలసి మండల సమస్యలపై వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గువ్వలకుంట్ల రైతులకు కురుకుంద పొలిమేర కింద సర్వేనెంబర్ 570, 477లలో సుమారు 70 ఎకరాలు ఉందన్నారు. వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయిగాని ఆన్‌లైన్ చేయలేదని, త్వరగా ఆన్‌లైన్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పాలెంచెరువు గూడెంకు వెళ్లేందుకు రహదారి పూర్తిగా దెబ్బతినిందని, గిరిజనులకు శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముసలిమడుగు, సింగరాజుపల్లె గ్రామాలలోనే ఇళ్లస్థలాలకు కేటాయించాలని కోరారు. ఎం.లింగాపురం, శివపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు వాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణం చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను పరిష్కరించేందకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను దుశ్శాలువలు కప్పి, కొలనుభారతిదేవి చిత్రపటాన్ని బహూకరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఇస్కాలలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

పాములపాడు: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాలు పొందాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అన్నారు. మంగళవారం మండలంలోని ఇస్కాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 474 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు మౌలాలి, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబన్న, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి:మంగళవారం పెద్దగుమ్మడాపురం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 659 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రఘురామ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, సర్పంచు నక్క విజయ్‌కుమార్, ఎంపీటీసీ శివన్న, కో–ఆప్టెడ్ సభ్యుడు మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: తాటిపాడు గ్రామసచివాలయం వద్ద తాటిపాడు సర్పంచ్ వంగల లక్ష్మీదేవి, భాస్కరాపురం సర్పంచ్ మాధవి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ సువర్ణమ్మ, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ ముఖ్య అతిథులుగా హాజరై 316 మందికి పలురకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ లు బషీర్, నాగేంద్ర, ప్రాథమిక వైద్యుడు గంగాధర్, ఎంఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: పేదల సంక్షేమమే ఊపిరిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణ యుగమని గ్రామ సర్పంచ్ కాటం రాధమ్మ, ఎంపీటీసీ కళావతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్త ముచ్చుమర్రి సచివాలయం వద్ద ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కాటం రాధమ్మ, ఎంపీటీసీ కళావతి 585 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏఈ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శుచీశుభ్రతపై అవగాహన

శ్రీశైలం: శ్రీశైలక్షేత్ర పరిధిలోని భోజన, ఫలహార హోటల్, రెస్టారెంట్ల నిర్వాహకులకు మంగళవారం నంద్యాల జిల్లా ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ షేక్ ఖాసీం వలి, హైదరాబాద్ ఎఫ్ఓఎస్‌టీఏసీ ట్రైనర్ డాక్టర్ చాగంటి ఆంజనేయులు ఆహార పర్యవేక్షణ, శుచీశుభ్రతలపై ఓ హోటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్ధారించిన ప్రమాణాల మేరకు ఆహార పరిరక్షణ, పరిశుభత, నాణ్యత, తదితర అంశాలను వివరించారు.


వృద్ధులకు అన్నదానం

ఆత్మకూరు: పట్టణ శివారులోని మానవతా నిలయం వృద్ధాశ్రమంలో మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఆధ్వర్యంలో అధ్యక్షులు మున్వర్ బాషా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయక్ అహ్మద్, ఉమన్‌బాషా, హరికృష్ణ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి కృషి చేయాలి

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి విశేష కృషి చేస్తుందని, వైద్యాధికారులు అందుకు తగినట్లుగా పనిచేయాలని నంద్యాల జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారదబాయి సూచించారు. బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎల్‌సీడీసీ ప్రోగ్రాం, టీబీ వ్యాధి, హైరిస్క్ కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్, ల్యాబ్ రూములను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యాధికారి భావనారెడ్డి, డీపీఎంఓ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



అల్లూరులో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

నందికొట్కూరు రూరల్ : ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కట్టా మంజుల అన్నారు. మంగళవారం అల్లూరు గ్రామంలో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అర్హత కలిగి ఉండి ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటే వారిని గుర్తించి వారికి కూడా అందించాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఓంకార్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నాగలక్ష్మయ్య, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీవో శోభారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు రవీంద్రనాయుడు, పబ్బతి రవి, మాండ్ర వేదవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అల్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మురుగు కాలువలు, సీసీ రోడ్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- వలంటీర్లకు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఆత్మకూరు, నల్లకాల్వ గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

ప్రతి ఒక్కరూ లబ్ధి పొందాలి



కొత్తపేట సచివాలయం వద్ద సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: జగనన్న సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని కొత్తపేట, మండలంలోని నల్లకాల్వ గ్రామాల్లో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 2 లక్షల 60 వేల మంది వలంటీర్లు, లక్షా 50 వేల మంది సచివాలయ ఉద్యోగులు, 3 వేల మంది అధికారులతో లక్షా 60 వేల కుటుంబాలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఇతర సంక్షేమ పథకాలు అందేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా అన్ని రకాలకు చెందిన లబ్ధిదారులు ఈ సర్టిఫికెట్లు పొందాలన్నారు. ముఖ్యమంత్రిజగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తూ నవరత్న పథకాలు అందించారని చెప్పారు. ఇప్పటికే 99 శాతం పథకాలు అందాయని, మిగిలిన 1 శాతం కూడా అందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు.

వలంటీర్లను కించపరచడం తగదు

వలంటీర్లకు సినీ నటుడు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి డిమాండ్ చేశారు. వలంటీర్‌వ్యవస్థ రాష్ట్రానికే కాదు , దేశానికే ఆదర్శమని, గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్య స్థాపనలో వలంటీర్ల పాత్ర కీలకమైనదని, అలాంటి వలంటీర్ల వ్యవస్థను కించపరిచే విధంగా పవన్‌కల్యాణ్ మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఎవరినీ మోసగించాల్సిన అవసరం వలంటీర్లకు లేదని, వారు తమకు కేటాయించిన గృహాల్లో బాధ్యతా యుతంగా పనిచేస్తూ ప్రజల మన్నన పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పాభువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఎంపీపీ తిరుపాలమ్మ, వైస్ చైర్మన్ రాజగోపాల్, భాస్కర్, విజయచౌదరి, విజయ్, సుల్తాన్, నల్లకాల్వ సర్పంచ్ వెంకటరమణ, ద్రోణారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు రక్ష

మహానంది: పేదవారందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న సదుద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గాజులపల్లె గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, సర్పంచ్ గడ్డం చంటి, నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి, గాజులపల్లె కిట్టు, కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సి.నరసింహుడు, కలర్స్ రవినాథరావు, గజ్జ పెద్దపక్కీరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బారెడ్డి రామతులశమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చైతన్య, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, నాయకులు శివశంకర్, భూమా రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'జగనన్న తోడు'

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అర్హులందరికీ జగనన్న తోడు పథకం అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు మున్సిపల్ అధికారులు, మెప్మా అధికారులు, ఎంపికైన లబ్ధిదారులు హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఉపాధికి ఊతమిచ్చేలా ప్రభుత్వం వడ్డీలేని రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిరుపేదలైన చిరు వ్యాపారులకు, హస్త కళాకారులకు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ఆర్థికంగా రుణాలు అందిస్తుందని చెప్పారు. ఒక్కొక్కరికి ఏటా రూ. 10 వేలు సునాక్న వడ్డీకే రుణం అందించినట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 694 మందికి రూ. 6. 94 కోట్లు రుణం ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చాంద్‌బాషా, హమీద్, మంగళి కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నందికొట్కూరు: పట్టణ పరిధిలోని పగిడ్యాల రోడ్డులో బైక్‌ను బొలేరో వాహనం ఢీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం కర్నూలు నుంచి వినయ్‌కుమార్ భార్య ఊరు ప్రాతకోటకు బైక్‌పై వెళ్తుండగా పగిడ్యాల నుంచి బియ్యం లోడుతో నందికొట్కూరుకు వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపారు.

నాటు సారా స్వాధీనం

నాటు సారాను విక్రయిస్తున్న నీలిషికారి శేఖర్ నుంచి ఐదు లీటర్లు స్వాధీనం చేసుకున్ని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ తెలిపారు. అలాగే పట్టణ శివారులో కొణిదేల రోడ్డు వైపు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకుని, రూ.11 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

శ్రీశైలంప్రాజెక్ట్: ఏపీట్రాన్స్‌కోలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం సున్నిపెంటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నెల 26న విజయవాడలో నిర్వహించబోయే విద్యుత్ ఉద్యోగుల ,కాంట్రాక్ట్ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని, అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలపాలని ఏపీఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునియన్, ఏఐటీయూసీ రాష్ట్ర స్ట్రగుల్ కమిటీ నాయకులు కె.నాగిరెడ్డి, డి.ఓబులయ్య, టి.వెంకట్, ఎ.శంకర్ కోరారు.

మానవీయ విలువలు కలిగి ఉండాలి

జూపాడుబంగ్లా: ప్రతి వ్యక్తి తప్పనిసరిగా మానవీయ విలువలను కలిగి ఉండాలని తిరుమల తిరుపతి హిందూధర్మ పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర మల్లు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామంలో మేడా సుబ్రహ్మణ్యం స్వామి శ్రీమద్రామాయణం గురించి భక్తులకు వివరించారు. భూమిపైన మానవుని ప్రవర్తన ఎలా ఉండాలో శ్రీమద్రామాయణం వివరిస్తుందన్నారు. అశాంతి, అభద్రత తొలగాలంటే దీని పారాయణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో భజనమండలి అధ్యక్షుడు మండ్ల పాలరాముడు, రామచంద్రుడు, పెద్ద బాబు, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు


విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

నందికొట్కూరు: స్కూల్ విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఓ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అదే స్కూల్‌లో పని చేస్తున్న ప్రమోద్ అనే ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు దిశ ఎస్ఓఎస్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిపై 294బీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అతనికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో బాలిక తల్లిదండ్రులు కేసును ఉపసంహరించుకునట్లు సీఐ తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన హెల్పర్ పోస్టులు నందికొట్కూరు పట్టణంలోని 9వ వార్డులో–14 సెంటర్ జనరల్, శాతనకోట–3 జనరల్, మిడుతూరు మండలం సున్నంపల్లి–బీసీ–డీ, వీపనగండ్ల–2లో బీసీ–బీ, పగిడ్యాల మండలం ప్రాతకోట–4లో బీసీ–సీ, పాములపాడు మండలం ఎస్. కొట్టాల–బీసీ–డీ, భానుముక్కల–2లో బీసీ–ఈ, జూపాడుబంగ్లా మండలం పాతులపాడు–01లో బీసీ–బీ, కొత్తపల్లి మండలం ముసలిమడుగు గూడెంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం–వర్కర్ పోస్టుకు ఎస్టీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, ఆ గ్రామానికి కోడలై ఉండాలన్నారు. ఎస్సీ,ఎస్టీలు 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు.

అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు



ఉపాధ్యాయులను సన్మానించిన తాటిపాడు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తాటిపాడు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం సతీష్‌చంద్ర తెలిపారు. మంగళవారం పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. వెంకటయ్య, సాయిప్రసాద్, అమీర్‌బాషా పదోన్నతులపై ఉన్నత పాఠశాలలకు వెళ్లారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు శాలువకప్పి, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉస్మాన్‌బాషా, సతీష్‌కుమార్, అహమ్మద్ బాషా, భాగ్యమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

దళితుల శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

జూపాడుబంగ్లా: 80 బన్నూరులో దళితుల శ్మశానవాటికకు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించేలా చేయాలని 80బన్నూరు గ్రామానికి చెందిన దళితులు మంగళవారం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. 80బన్నూరు గ్రామంలోని సర్వేనెంబర్ 383లో 0.50సెంట్ల దళితుల శ్మశానవాటికలోంచి నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సర్వేనెంబర్ 126లోని భూమిని పరిశీలించి శ్మశానవాటికకు కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నట్లు తెలిపారు. అయితే అందులోని భూమిని గ్రామానికి చెందిన కొంత మంది పేదదళితులు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికి ఇబ్బంది కలిగించకుండా ప్రత్యామ్నాయంగా శ్మశానవాటికోసం స్థలం ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కలిసి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని సిద్ధార్థరెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నానిరెడ్డి అలియాస్ మద్దిలేటిరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, సామేలు తదితరులు పాల్గొన్నారు.